క్లుప్తంగా

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక వత్రాలు చేస్తున్న దంపతులు

ఎటపాక: కార్తీక మాసం సందర్భంగా వెంకటరెడ్డిపేటలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వంద మంది దంపతులు వత్రాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉసిరి చెట్టు కింద వన భోజనాలు చేశారు. అర్చకులు ఆరట్ల నారాయణాచారి, మాదిరెడ్డి కృష్ణబాబు, మధు గణేష్, సాయిబాబు, వెంకన్నబాబు, గణపతిరావు తదితరులు పర్యవేక్షించారు.

400 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

కూనవరం:మండల కేంద్రంలో విజయసాధన పబ్లిక్ పాఠశాల ఆవరణలో పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్(పీఎస్ఆర్) ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 400 మంది రోగులకు సుగరు, బీపీ, ఈసీజీతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కిమ్స్ ఆస్పత్రి నిర్వాహకులు భీమ్‌రెడ్డి బాబురెడ్డి, చావా శివరామకృష్ణ, ఆస్పత్రి సిబ్బంది, మార్కెటింగ్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



దేవరాపల్లిలో అవగాహన కల్పిస్తున్న బీఎల్‌వో భారతి

గూడెంకొత్తవీధి: పద్దెనిమిదేళ్ల నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని గూడెంకొత్తవీధి తహసీల్దారు రామకృష్ణ అన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.ఈ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు విధులు నిర్వహించారు.

సంతల్లో పాలిథిన్ సంచులు విక్రయించొద్దు



జర్రెల వారపు సంతలో అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ నాగరాజు, నాయకులు

గూడెంకొత్తవీధి: కలెక్టర్ ఆదేశాల మేరకు వారపు సంతల్లో పాలిథిన్ సంచులను విక్రయించొద్దని జర్రెల పంచాయతీ సర్పంచ్ వీరో జునాగరాజు అన్నారు. జర్రెల వారపు సంతలో వ్యాపారులకు అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించి పాలిథిన్ సంచులు విక్రయించే వ్యాపారులకు రూ.2000 అపరాధ రుసుం విధించినట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అడపా విష్ణుమూర్తి, టీడీపీ నాయకుడు మత్యరాజు భగవాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి: మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లి గ్రామానికి చెందిన కె.అప్పారావు చింతూరు వెళ్లి తిరిగి వస్తుండగా మండలంలోని వాలమూరు గ్రామం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి. పక్కనున్న చెట్టును ఢీ కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు స్పందించి అతడిని రంపచోడవరం ఆస్పత్రికి తరలించారు

అన్నదాత ఆశలు



పంటను ఇళ్లకు చేరవేస్తున్న రైతులు



చెరకుంపాలెంలో వరి పంట రక్షణ పనుల్లో రైతులు

- వాతావరణం అనుకూలం
- ఏపుగా పెరిగిన వరి పైరు

రాజవొమ్మంగి: ఏజెన్సీ వ్యాప్తంగా ఈ ఏడాది **ఖరీఫ్ వరి సాగును రైతులు ముమ్మరంగా చేపట్టారు.** తొలకరిలో వర్షాలు ఆశాజనకంగా కుర**వడంతో** పాటు వాతావరణం అనుకూలించడంతో **నీటి వసతుల** కింద మాత్రమే కాకుండా, వర్షాధారంగా **కూడా** వరి సాగు చేపట్టారు. ఆరుగాలం శ్రమించి **పండించిన** పంట పక్వానికి రావడంతో తమ కష్టం **ఫలించిందని** రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **రంపచోడవరం** డివిజన్‌లో ఇప్పుడిప్పుడే కోతలు, **మాసూళ్లు** మొదలయ్యాయి.

ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సమాయత్తమైంది. డివిజన్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 9,795 మంది రైతులు రూ.23,092 ఎకరాల్లో వరి సాగు చేపట్టినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు ఈ సీజన్‌లో వరి సుమారు 4,759 టన్నుల దిగుబడిని అంచనా వేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు అధికారులు దాదాపు అన్ని ఏర్పాట్లు చేశారు. **డివిజన్‌లోని దేవీపట్నంలో ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాగా మిగిలిన అన్ని మండలాల్లో ఈ నెలాఖరుకు కొనుగోలు కేంద్రాలు తెరిచేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలివిడతగా 54వేల గన్నీ బ్యాగులను దేవీపట్నం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలకు చేరవేసినట్లు సివిల్ సప్లయ్స్** మేనేజర్ గణేశ్‌కుమార్ ఫోన్ ద్వారా తెలిపారు. గత ఏడాది సుమారు 16వేల టన్నులు ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది రంపచోడవరం డివిజన్‌లో వాతావరణం అనుకూలించడంతో మరింత వరి కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పండించిన పంటను అమ్ముకోవాలని సూచించారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాకు రూ. 2,320 ధర ప్రకటించగా సాధా**రణ రకా**లకు క్వింటాకు రూ. 2, 300 చెల్లిస్తామ**న్నారు.** రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సది**్వనియోగం** చేసుకోవాలని, దళారులకు ధాన్యం **విక్రయించ**వద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రెండు రోజుల్లోనే చెల్లింపులు జరుగుతాయన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

యంత్రాల సహాయంతో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో సుమారు 2,500 హెక్టార్లలో వరి సాగవుతోంది. ఇప్పటి వరకు 30 శాతం కోతలు పూర్తయినట్లు ఏఓ చక్రధర్ తెలిపారు.



చెరకుంపాలెంలో యంత్రాల ద్వారా వరి కోతలు చేస్తున్న రెతులు

ఘనంగా త్రినాథ స్వాముల మేళా



స్వాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంతేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి ఆలయంలోని త్రిమూర్తుల విగ్రహాల వద్ద ఆదివారం రాత్రి త్రినాథ స్వాముల మేళాను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రామం ఆధ్వర్యంలో పాడేరు వర్తకులు రామచంద్రరావు, సునీతలు ఈ మేళాను నిర్వహించారు. పట్టణంలోని భక్తులంతా హాజరై ఈ మేళాలో పాల్గొని త్రిమూర్తుల విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహచలం నాయుడు, ప్రతినిధులు వెంకటరత్నం, రాజు, పోతురాజు, అనిల్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



రంపచోడవరంలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం , రైతు కూలీ సంఘం

రంపచోడవరం : అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ల అనుబంధ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఏజెన్సీ గిరిజన సంఘం,రైతు కూలీ సంఘం సభ్యులు రంపచోడవరం ప్రచారాన్ని నిర్వహించారు. జోగారావు , బాబూరావు, రామరాజు, చిట్టబ్బాయి, రామిశెట్టి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పాలగూడెంలో బోరు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కూనవరం: జల్‌జీవన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరకగూడెం సర్పంచ్ నూపా వెంకన్నబాబు అన్నారు. మండలంలో కరకగూడెం పంచాయతీ పరిధిలోని పాలగూడెం, పొట్లవాయిగూడెం గ్రామాల్లో జల్‌జీవన పథకంలో భాగంగా మంజూరైన చేతిబోరుల ఏర్పాటు పనులను అయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేంద్ర పభుత్వం ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు చేసి తాగునీరు అందించనున్నట్టు చెప్పారు. పూర్ణ, రామారావు, పవన్, మహేష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే...

- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- పేరుకుపోయిన చెత్తకుప్పలు
- దుర్గంధంతో స్థానికులు సతమతం
- పట్టించుకోని అధికారులు



యండపల్లివలసలో పాఠశాలకు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్త



గురుకులం పాఠశాలకు వెళ్లే దారిలో చెత్త

అరకులోయ రూరల్: మండలంలో పద్మాపురం మేజర్ పంచాయతీ యండపల్లివలస గ్రామంతో పాటు పలు ప్రాంతాల్లో పారిశుధ్యం కొరవడింది. పద్మాపురం, రాజధాని జంక్షన్, సినిమాహల్ సెంటర్, టీచర్స్ కాలనీ, బెడ్డగుడ, వివిధ ప్రధాన కేంద్రాల్లో చెత్తా చెదారాలు పేరుకుపోయాయి. పేరుకే మేజర్ పంచాయతీ అయినా పారిశుధ్య పనులు మాత్రం అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో తీవ్ర దుర్గంధంతో నివసించలేకపోతున్నామని చెబుతున్నారు. ఈగలు, దోమలతో పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రిసార్ట్‌లు, లాడ్జీలు ఉండడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాజవొమ్మంగి: జడ్డంగి రైతు సేవా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు ఏవో చక్రధర్ తెలిపారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతు ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాము పండించిన ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రెండు రోజుల్లోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. మండలంలో 6,201 ఎకరాల్లో వరి సాగవుతోందన్నారు. దశల వారీగా రాజవొమ్మంగి, శరభవరం, లబ్బర్తి, వాతంగి, దూసరపాము గ్రామాల్లో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరుస్తామన్నారు.

26న సీఐటీయూ ధర్నా

అరకులోయటౌన్/ ముంచంగిపుట్టు: కార్మికులపై కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న పాడేరులో మహాధర్నా నిర్వహిస్తున్నామని, గిరిజనులంతా మద్దతు తెలిపి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ అరకులోయ, ముంచంగిపుట్టులో సీఐటీయూ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయా మండలాల్లో నాయకులు భగత్‌రామ్, కె.శంకర్‌రావు మాట్లాడుతూ కార్మికుల చట్టాలను పక్కగా అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, జీఓ నంబరు-3కు చట్టబద్ధత కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సింహాద్రి, పద్మ, సింహాచలం, జర్రెల ఉపసర్పంచ్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

అడ్డతీగల: అడ్డతీగలలోని సోమాలమ్మ ఆలయం వద్ద సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు బాల విఘ్నేశ్వర యూత్ సభ్యులు తెలిపారు. కార్తీక మాసం సందర్భాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటల నుంచి ప్రమిదలు ఏర్పాటు చేసి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు. .

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

గంగవరం : కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంఈవో మల్లేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 7న జరగనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ అవగాహన నేపథ్యంలో ఈ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు హాజరవుతున్నట్టు తెలిపారు. సింగిల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కూడా పిల్లలకు మధ్యాహ్న భోజనం సమకూర్చి సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఆదివాసీ చట్టాలను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీను

గంగవరం: మండలంలోని రాజంపాలెంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలకు రక్షణ లేకుంటే ఆదివాసీల ఉనికికే ప్రమాదమన్నారు. ఆదివాసీల బతుకుల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల రక్షణకు చేసే న్యాయ పోరాటంలో ఆదివాసీలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేతలు బాబూరావు, నూకరాజు, ప్రదీప్ కుమార్, యర్రమ్మ పాల్గొన్నారు.

నేడు కార్తీక వ్రతం

రంపచోడవరం: రంపచోడవరంలో నారాయణగిరి కొండపై ఉన్న ద్వారకా తిరుమల దత్తత దేవాలయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు అద్దంకి వెంకటేశ్వరరావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

బ్యాంకు ఏర్పాటుకు స్థలం పరిశీలన

కొయ్యూరు: మండల కేంద్రానికి భారతీయ యూనియన్ బ్యాంకు యూబీఐ శాఖ మంజూరైంది. రాజేంద్రపాలెంలో యూనియన్ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఆ బ్యాంకుకు చెందిన ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ఒక భవనాన్ని సైతం పరిశీలించారు. బ్యాంకు శాఖను ఏర్పాటుకు భవనం కావాలని అధికారులు ప్రకటన కూడా జారీ చేశారు. త్వరలో యూబీఐ బ్యాంకును ఏర్పాటు చేయనున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోతకు గురై ప్రమాదకరంగా మారిన వంతెన

అరకులోయ రూరల్: మండలంలో యండపల్లివలస సమీపంలో అరకు-పాడేరు ప్రధాన రహదారి వద్ద ఉన్న బురదగెడ్డ వంతెన పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నుంచి నిత్యం భారీ రాకపోకలు జరుగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆదివాసీ చట్టాలపై అవగాహన అవసరం



తోటకూరపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు

వై.రామవరం: మండలంలోని తోటకూరపాలెం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్(274/16) సంఘం సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలు, హక్కులపై ప్రతీ గిరిజనుడు అవగాహన పొందాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు పక్కా అమలుకోసం అందరూ ఐక్యంగా పోరాడి విజయం సాధిద్దామన్నారు. అందరూ ఐక్యంగా హక్కుల కోసం పోరాడకపోతే ఆదివాసీల భవిష్యత్ ప్రశ్నార్థమమయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు.1/70 చట్టం రద్దు అయితే ఆదివాసీలకు నిలువ నీడ ఉండదన్నారు. అ చట్టంతో పాటు పలు గిరిజన చట్టాలు అమలుకు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం గ్రామంలో గిరిజన చట్టాలు, హక్కులపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బాబూరావు, నాయకులు ప్రసాద్, మంగిరెడ్డి, లక్ష్మీకాంతం, బూదేవి, రమేష్‌రెడ్డి, రాజారావు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థులకు పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

చింతూరు: అరకు నియోజకవర్గం అనంతగిరిలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన నాలుగవ రాష్ట్ర స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ స్పోర్ట్స్‌మీట్‌లో చింతూరు ఏకలవ్య విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 50 విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో బాలికల విభాగంలో 19-బంగారు, 12-రజత, ఒక-కాంస్య పతకాన్ని సాధించారు. బాలుర విభాగంలో 3-బంగారు, 3-రజత, 2-కాంస్య పతకాలు సాధించారు. బాలుర కబడ్డీతో పాటు బాలికల ఖోఖో, హ్యాండ్‌బాల్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర ఖోఖో జట్టు రెండో స్థానంలో నిలిచింది. పతకాలు సాధించిన విద్యార్థులు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆడనున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ దలీప్‌సింగ్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు



మారేడుమిల్లి ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి ప్రధాన రహదారిలో తరుచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల మండంలోని పలు పర్యాటక ప్రదేశాలను అధికారులు ప్రారంభించారు. కార్తీక మాసం కావడంతో పర్యాటకులు పలు దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలిస్తున్నారు. ఇక్కడి పర్యాటక ప్రదేశాల్లో శని, అదివారాలు అయితే పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. వాహనాలను రోడ్డుపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. మారేడుమిల్లి మీదగా నిత్యం ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలతో పాటు వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో తరుచూ గంటలు తరబడి ట్రాఫిక్‌జామ్ అయి తరుచూ స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గానికి అభినందనలు



ఏపీ మెడికల్ లేబొరేటరీ టీక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరులోని గిరిజన ఉద్యోగుల భవనంలో ఆదివారం ఏపీ మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.వి.ఆర్.ప్రభాకర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణరావు, ఉపాధ్యక్షుడిగా పి.పాపాయమ్మ, పి.జోగిదొర, సీహెచ్.అనంత్, పండుదొర, ఆర్.రమాదేవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జె.బాలయ్య, సంయుక్త కార్యదర్శులుగా టి.అప్పలనాయుడు, వి. శ్రీను, ఐ.నాగభూషణ్, పి.సుధారాణి, అర్.రామలక్ష్మి, కోశాధికారిగా ఎస్.శ్రీదేవిలతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. లేబ్ టెక్నీషియన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, లేబ్ టెక్నీషియన్లకు అండగా ఉంటామని నూతన కార్యవర్గం తెలిపింది. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించారు.

గంజాయికి దూరంగా ఉండాలి



మామిడిపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

చింతపల్లి; గిరిజనులు గంజాయి సాగు రవాణా వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సీఐ వినోద్ బాబు అన్నారు.ఆదివారం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మామిడిపల్లి జంక్షన్‌లో గిరిజనులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏజెన్సీలో గంజాయి సాగు రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాల కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయితో పాటు జూదం, మత్తు పదార్థాల జోలికి పోకుండా ఆరోగ్యకర జీవితం సాగించాలన్నారు. ప్రభుత్వం గిరిజన రైతాంగానికి సంప్రదాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో వాటిపై దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. గ్రామాల్లో ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు. ఎస్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం



ముంచంగిపుట్టులో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నాలుగు రోడ్ల కూడలి, సంతబయలు,పోలీసు స్టేషన్ జంక్షన్, ఇందిరా కాలనీల్లో గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహనచోదకులపై దాడికి పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. చీకటిపడితే గుంపు గుంపులుగా కుక్కలు వీధుల్లో సంచరిస్తున్నాయి. దీంతో స్థానికులకు రోడ్ల మీదకు వచ్చేందుకు భయపడుతున్నారు. కుక్కకాటు బాధితుల సంఖ్యతో రోజురోజుకు పెరుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జీసీసీ చైర్మన్‌కు సన్మానం

అరకులోయ టౌన్/ డుంబ్రిగుడ: జీసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి అరకులోయకు విచ్చేసిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర, జీసీసీ డైరెక్టర్ నాగరాజు, నాయకులు లక్ష్మణుడు, అప్పారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడలో కిడారి శ్రావణ్‌కుమార్‌కు నాయకులు ఘనంగా సన్మానించారు.